


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 23-05-2026 | సంపుటి - 27 | సంచిక -361 | రూ : 4 | పేజీలు: 8


## మోదీ సుదీర్ఘ మీటింగ్ మంత్రులకు ఇచ్చిన ఆ సూచనలు ఏంటి?



- నాలుగున్నర గంటలు జరిగిన భేటీ
- తొమ్మిది మంత్రిత్వ శాఖల నివేదికల సమర్పణ
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'ఈజ్ ఆఫ్ లివింగ్'పై చర్చించినట్లు ప్రధాని మోదీ వెల్లడి
- ఐదు దేశాల పర్యటన వివరాలను పంచుకున్న జైశంకర్

2లో




## నీట్ లీక్ బాధ్యత ఎవరిది?

- కేంద్రం, ఎన్‌టీఏ పరస్పర విరుద్ధ వాదనలు
- లోపాన్ని ఒప్పుకున్న విద్యాశాఖ మంత్రి
- సిస్టమ్ ద్వారా లీక్ జరగలేదన్న ఎన్‌టీఏ చీఫ్
- వేర్వేరు ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం

న్యూఢిల్లీ : నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వాదనలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి 'చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగిందని అంగీకరించగా.. ఎన్‌టీఏ డీజీ మాత్రం 'సిస్టమ్ (వ్యవస్థ) ద్వారా ప్రశ్న పత్రం లీక్ కాలేదు' అని అంటున్నారు. ఇప్పుడు ఈ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మరింత గందరగోళాన్ని పెంచుతున్నాయి. తరువాయి 2లో

## రైలు నుంచీ 'అగ్ని-1' సక్సెస్!

- అగ్ని 1 స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం
- ఒడిశాలోని చాందీపూర్ నుంచి శుక్రవారం ఈ పరీక్ష నిర్వహణ
- రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని ప్రైమ్ క్షిపణి ప్రయోగం కూడా సక్సెస్
- డీఆర్డీఓ, సైనిక బలగాలను అభినందించిన రక్షణ మంత్రి



2లో

## బండి భగీరథ్‌ను దాచిపెట్టిందెవరు?

- రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య ఫెవికాల్ బంధం
- అధికారంలోకి వస్తామనే నమ్మకముంటే అసెంబ్లీని రద్దు చేయాలి
- 9 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలతోనైనా రాజీనామా చేయించాలి
- పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం ప్రకటించాలి
- క్యాబినెట్‌లో ఈ అంశంపైనే చర్చించాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

2లో



## సచివాలయం ముందు కవిత నిరసన

- రెండున్నరేండ్లుగా వ్యవసాయశాఖపై రివ్యూ చేయలేదంటూ సీఎంపై ఆగ్రహం
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలంటూ డిమాండ్
- లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలంటూ హెచ్చరిక
- టీఆర్ఎస్ చీఫ్ అరెస్టు


2లో





## భారత్ నుంచి పాకిస్థాన్‌కు పాకిన 'బొద్దింక'!

- పాక్‌లో కాక్రోచ్ అవామీ పార్టీల ఆవిర్భావం
- ఇన్‌స్టాగ్రామ్‌లో వేగంగా పెరుగుతున్న ఫాలోవర్లు
- నిరుద్యోగ యువత గొంతుకగా మారిన బొద్దింక
- విద్య, ఉపాధి సమస్యలపై డిజిటల్ పోరాటం
- భారత్ స్ఫూర్తితోనే పుట్టాయని పాక్ గ్రూపుల వెల్లడి

2లో




## 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: భట్టి




- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**వ్యవసాయం వెన్నెముక..**

రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపా జిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయమన్నారు. తరువాయి 2లో



## నారా లోకేశ్ వర్సెస్ చిదంబరం.. డీలిమిటేషన్‌పై మాటల యుద్ధం!

- కేంద్ర ప్రభుత్వ డీలిమిటేషన్ బిల్లును సమర్థించిన లోకేశ్
- బిల్లును వ్యతిరేకించి ప్రతిపక్షాలు దక్షిణాదికి నష్టం చేశాయని విమర్శ
- లెక్కలు చూసుకోవాలంటూ చిదంబరం కౌంటర్
- లోక్‌సభలో దక్షిణాది వాటా తగ్గుతుందని వివరణ
- 2026 జనాభా లెక్కల తర్వాత అయితే మరీ నష్టమన్న లోకేశ్

2లో

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: భట్టి

హైదరాబాద్: 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**వ్యవసాయం వెన్నెముక..**

రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయమన్నారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమన్నారు.

**అది భవిష్యత్ పెట్టుబడి..**

పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం అభివృద్ధి రెండింటిని జోడెద్దులుగా పరుగులు తీయగలవని ప్రజా ప్రభుత్వం చేతల్లో నిరూపించిందన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు.

*** బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలి..**

నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి (Solar Power) విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందని వివరించారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి (GSDP), ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.

**తలసరి ఆదాయంలో అగ్రగామి..**

ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2% గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7% తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు

**వడ్డీలేని రుణాల పెంపు...**

మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు.

# రైలు నుంచీ 'అగ్ని 1' సక్సెస్!

భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని 1'ను శుక్రవారం విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక బలగాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ఈ పరీక్షలో క్షిపణికి సంబంధించిన అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులను విజయవంతంగా ధృవీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారత్ ఇటీవలే క్షిపణి ప్రయోగాల్లో సరికొత్త సామర్థ్యాన్ని సాధించింది. గతేడాది సెప్టెంబర్ 24న, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో), ఎస్ఎఫ్‌సీ సంయుక్తంగా 'అగ్నిప్రైమ్' క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి విజయవంతంగా ప్రయోగించాయి. దేశంలో ఈ తరహా ప్రయోగం జరగడం ఇదే ప్రథమం. ఈ అగ్నిప్రైమ్ క్షిపణి 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. రైల్ నెట్‌వర్క్‌పై దేశంలో ఎక్కడికైనా వేగంగా తరలించి, శత్రువుల కంటపడకుండా చాలా తక్కువ సమయంలో ప్రయోగించే సౌలభ్యం ఈ రైల్ మొబైల్ లాంచర్ ప్రత్యేకత. ఈ విజయవంతమైన ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓ, ఎస్ఎఫ్‌సీ, సాయుధ బలగాలను ఆయన అభినందించారు. రైల్ నెట్‌వర్క్ నుంచి క్షిపణిని ప్రయోగించే వ్యవస్థను అభివృద్ధి చేసిన కొద్ది దేశాల సరసన భారత్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రోడ్ మొబైల్ అగ్ని పి క్షిపణి సైన్యంలో సేవలందిస్తుండగా, ఈ కొత్త సామర్థ్యం దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.

# మోదీ సుదీర్ఘ మీటింగ్.. మంత్రులకు ఇచ్చిన ఆ సూచనలు ఏంటి?

'వికసిత్ భారత్ 2047' కేవలం ఒక నినాదం కాదని ప్రధాని మోదీ తెలిపారు. దీన్ని ఒక బాధ్యతగా, బలమైన నిశ్చయంగా భావించాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కేంద్ర మంత్రిమండలితో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు ఈ భేటీ సాగింది. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఒక మధ్యంతర సమీక్షగా నిలిచింది. పశ్చిమాసియా సంక్షోభం, ప్రధాని ఐదు దేశాల పర్యటన, ఇంధన పొదుపుపై పటిష్ఠ చర్యల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఏదో కీలక నిర్ణయం తీసుకోనుందని జోరుగా ప్రచారం జరిగింది. పాలనా సంస్కరణలు ఈ సమావేశంలో పాలనా సంస్కరణలు, ప్రభుత్వ పనితీరుపై ప్రధానంగా చర్చించారు. తొమ్మిదికి పైగా మంత్రిత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ప్రధానికి సమర్పించాయి. అలాగే నీతి ఆయోగ్, క్యాబినెట్ సెక్రటరీ కూడా భవిష్యత్తు ప్రణాళికలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఫైళ్లను అత్యంత వేగంగా పరిష్కరించిన శాఖలను ఈ సందర్భంగా ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ నిర్ణయాలు వేగంగా అమలయ్యేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**విదేశీ పర్యటన వివరాలు**

ప్రధాని మోదీ ఇటీవలి ఐదు దేశాల పర్యటన విజయవంతం కావడంపై మంత్రులు ఆయనను సత్కరించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల విజయాన్ని కూడా ప్రస్తావించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ పర్యటన విశేషాలను వివరించారు. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభం, దాని వల్ల వచ్చే ఆర్థిక సవాళ్లపై మోదీ చర్చించారు. ఈ సంక్షోభం వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కొరియాలో, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా జెనీవాలో ఉన్నందున ఈ భేటీకి రాలేకపోయారు. ''నిన్న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం చాలా ఫలప్రదంగా సాగింది. దేశంలో 'ఈజ్ ఆఫ్ లివింగ్' (జీవన సౌలభ్యం), 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార సౌలభ్యం) మరింత మెరుగుపరచడంపై పరస్పర ఆలోచనలు, ఉత్తమ విధానాలను పంచుకున్నాం. వికసిత్ భారత్ అనే మన ఉమ్మడి కలను సాకారం చేసుకోవడానికి పాలనా సంస్కరణలను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై కూడా చర్చించాం'' అని ప్రధాని మోదీ తెలిపారు.

# నారా లోకేశ్ వర్సెస్ చిదంబరం.. డీలిమిటేషన్‌పై మాటల యుద్ధం!

లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం దేశవ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశమైంది. ఏపీ మంత్రి నారా లోకేశ్ 'ది హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూతో ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కౌంటర్.. లోకేశ్ అంతే ఘాటుగా రీకౌంటర్ ఇవ్వడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

**లోకేశ్ ఏమన్నారు?**

'ది హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నారా లోకేశ్ కేంద్ర ప్రభుత్వ డీలిమిటేషన్ బిల్లును గట్టిగా సమర్థించారు. ఈ బిల్లును వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని మండిపడ్డారు. కొత్త జనాభా లెక్కల ప్రకారం సీట్ల విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. దీనివల్ల తమిళనాడు, కేరళ ఏడు స్థానాలు, ఆంధ్రప్రదేశ్ మూడు, తెలంగాణ ఒక లోక్‌సభ స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

**చిదంబరం కౌంటర్**

లోకేశ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. ''నా యువ మిత్రుడు లోకేశ్ డీలిమిటేషన్ గురించి మాట్లాడే ముందు కాస్త లెక్కలు సరిచూసుకోవాలి'' అని ఎద్దేవా చేశారు. కేంద్రం తెచ్చిన బిల్లు వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గుతుందని చెప్పారు. సీట్లను యాభై శాతం పెంచినా లాభం ఉత్తరాది రాష్ట్రాలకేనని, ఏపీ సీట్లు 25 నుంచి 38కి పెరిగినా మొత్తం సీట్లలో ఏపీ వాటా తగ్గిపోతుందని వాదించారు.

**లోకేశ్ రీ-కౌంటర్**

చిదంబరం ట్వీట్‌పై మంత్రి లోకేశ్ అంతే వేగంగా స్పందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల ఫ్రీజ్ 2026 జనాభా లెక్కల తర్వాత ముగుస్తుందని గుర్తుచేశారు. ఆ తర్వాత పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం ఖాయమన్నారు. ఈ నష్టాన్ని ఆపడానికే ఎన్డీయే ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లు తెచ్చిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఈ బిల్లును పార్లమెంట్‌లో ఎందుకు అడ్డుకున్నారో చిదంబరం చెప్పాలని లోకేశ్ నిలదీశారు.

# సచివాలయం ముందు కవిత నిరసన

హైదరాబాద్ : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం హైదరాబాద్ లోని సచివాలయం ముందు వడ్లు పోసి నిరసన తెలిపారు. సచివాలయం ప్రధాన ద్వారం ముందు కవిత వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి వరికంకులు, ప్ల కార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్తాల్లో తీసుకొచ్చిన వడ్లను కొందరు రైతులు సచివాలయం ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కవితతో సహా రైతులు, మహిళలు, టీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయలేదని విమర్శించారు. ధాన్యం, మక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారని తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారనీ, తరుగు పేరిట మోసం చేస్తున్న పట్టించుకునే వారు లేరని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 4546 డిగ్రీల టెంపరేచర్ లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నా... కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగడాని నీళ్ళు లేవనీ, టెంట్లు కూడా వేయలేదని కవిత ప్రభుత్వ నిరక్ష్యంపై మండిపడ్డారు. వడ దెబ్బకు గురై కొందరు చనిపోతే, పంటలను కొనే వారు లేక, అప్పులు తీరే దారి కనిపించక మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు చనిపోతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, రైతులకు మేలు చేయాలని సచివాలయం వద్ద ధర్నా చేశామని కవిత చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంట కొనటం లేదన్నారు. వెంటనే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఫలక్ నుమా పోలీస్ స్టేషన్ నుంచి బయటికొచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు గ్రేడ్ ఏ వరిని గ్రేడ్ బిగా రిజిస్టర్ చేస్తూ సన్న బియ్యానికి ఇచ్చచే బోనస్ ఎగ్గొడుతున్నారని విమర్శించారు. యూరియా యాప్ ఎవరికి అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు సహా అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

# గ్రీన్‌కార్డు దరఖాస్తుకు స్వదేశానికి వెళ్లాల్సిందే

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ(యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ పేర్కొన్నారు. ''అమెరికాలో తాత్కాలికంగా ఉంటున్న విదేశీయులకు గ్రీన్‌కార్డు కావాలంటే ఇకపై వారు తమ మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సిందే. అసాధారణ పరిస్థితుల్లోనే ఇందుకు మినహాయింపు ఉంటుంది'' అని ఆయన వివరించారు. అమెరికా వలస చట్టాల అసలు ఉద్దేశానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాక్ కహ్లర్ చెప్పారు. ఈ మేరకు కొత్త పాలసీ మెమోను యూఎస్‌సీఐఎస్ ప్రకటించింది. అసాధారణ పరిస్థితుల్లో అమెరికా నుంచే 'అడ్జస్ట్‌మెంట్ ఆఫ్ స్టేటస్'కు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఇప్పటికీ అందుబాటులో ఉంటుంది. అలాంటి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకొనే వారి విషయంలో అధికారులు అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ పాలసీ మెమో మార్గదర్శకాలు జారీ చేసింది. ''ఈ విధానం వల్ల వలస వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. చట్టంలోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గుతాయి. గ్రీన్‌కార్డు దరఖాస్తు తిరస్కరణకు గురైనా అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్నవారిని గుర్తించి, తొలగించే అవసరం తగ్గుతుంది'' అని జాక్ కహ్లర్ అన్నారు. ''విద్యార్థులు, తాత్కాలిక కార్మికులు, టూరిస్టు వీసా మీద అమెరికాకు వచ్చినవారు తమ పని పూర్తికాగానే దేశాన్ని వీడి వెళ్లాలి. గ్రీన్‌కార్డు హోదా పొందడానికి వారి పర్యటన తొలి అడుగులా మారకూడదన్నది ఈ విధానలక్ష్యం'' అని కహ్లర్ వివరించారు.

# నీట్ లీక్ బాధ్యత ఎవరిది?

న్యూఢిల్లీ : నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వాదనలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి 'చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగిందని అంగీకరించగా.. ఎన్‌టీఏ డీజీ మాత్రం 'సిస్టమ్(వ్యవస్థ) ద్వారా ప్రశ్న పత్రం లీక్ కాలేదు' అని అంటున్నారు. ఇప్పుడు ఈ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మరింత గందరగోళాన్ని పెంచుతున్నాయి. దీంతో లీక్ వ్యవహారంలో అసలు బాధ్యత ఎవరిది? తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలను కేంద్రం, ఎన్‌టీఏలు చేస్తున్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక పరీక్షను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్రం విఫలమైందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం తప్పును ఒప్పుకున్నారు. పరీక్ష నిర్వహణ వ్యవస్థలో లోపం జరిగిందని అంగీకరించారు. అయితే ఎన్‌టీఏ వాదన మాత్రం ఇంకోలా ఉంది. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ (డీజీ) అభిషేక్‌సింగ్ మాత్రం.. ప్రశ్నపత్రం వ్యవస్థ ద్వారా లీక్ కాలేదని ఈనెల 21న పార్లమెంటరీ కమిటీ ఎదుట చెప్పినట్టు వెల్లడి కావడం గమనార్హం. కొన్ని రోజుల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ... నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో 'చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగింది' అని స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకుంటోందని కూడా ఆయన తెలిపారు. ఇక్కడే ఇటు ప్రభుత్వం, అటు ఎన్‌టీఏ నుంచి భిన్నవాదనలు వినబడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. 'వ్యవస్థలో లోపం జరిగింది' అని ప్రభుత్వం చెప్తుంటే.. ఎన్‌టీఏ మాత్రం 'సిస్టమ్ ద్వారా లీక్ కాలేదు' అని ఎందుకు చెప్తోంది? అనే ప్రశ్న విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

# బండి భగీరథ్‌ను దాచిపెట్టిందెవరు?

హైదరాబాద్ : బండి భగీరథ్‌ను తొమ్మిది రోజులపాటు దాచి పెట్టిందెవరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పశ్నించారు. పోక్సో కేసు నిందితుడిని దాచి ఉంచడం నేరమనీ, ఇది ముమ్మాటికి హోంమంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత అని చెప్పారు. దీన్ని బట్టి రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌కు మధ్య ఫెవికాల్ బంధం ఉందని ర్థమవుతోందన్నారు. వారి మధ్య అనుబంధం వల్లే ఓ ఆడబిడ్డకి అన్యాయం చేయాలని చూశారని విమర్శించారు. దీనిపై వారిద్దరూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ మైనర్ బాలిక అన్యాయం జరిగిందని తల్లిదండ్రులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు అక్కడే నిలబెట్టి తీవ్ర ఆవేదనకి గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా?అని కేటీఆర్ ప్రశ్నించారు. హైకోర్టు బెయిల్ నిరాకరించడం వల్లే నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ప్రధాని పర్యటన వల్ల పోలీసులంతా బిజీగా ఉన్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలు సాకులు చెప్పడం సరైంది కాదన్నారు. ప్రధాని వస్తే నేరస్తులను స్వేచ్ఛగా వదిలేస్తారా?అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి ఆస్పత్రిలో తొమ్మిది రోజుల పాటు నిందితుడిని దాచిపెట్టారన్న వార్తలు వస్తున్నాయనీ, దీనిపై ప్రభుత్వం విచారణ చేయాలని కోరారు. అమ్మాయి కుటుంబంపైనే 'హనీ ట్రాప్' అంటూ కౌంటర్ కేస్ పెట్టి కుట్ర చేయించింది ఎవరో చెప్పాలని బండి సంజయ్‌కి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసు నిందితులు తొమ్మిది రోజులు తప్పించుకోలేరనీ, కేంద్రమంత్రి కొడుకు కావడం, ముఖ్యమంత్రి అండదండలు ఉండడం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. తన బావమరిది డ్రగ్స్ తీసుకుంటే కేసు ఎందుకు పెట్టడం లేదనీ, దమ్ముంటే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంట కొనుగోళ్లపైన, పంటల వారీగా ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని నిరూపిస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమని అన్నారు. కొడంగల్ సహా ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్దామని పశ్నించారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్నులు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభం తీవ్రంగా ఉందన్నారు. దీన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులంతా అవాస్తవాలు చెప్తున్నారని అన్నారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలోనైనా అత్యంత కీలకమైన ఈ పంట కొనుగోళ్ళ సంక్షోభంపైన చర్చించాలని డిమాండ్ చేశారు. రైతన్నల కష్టాలే ఏకైక ఎజెండాగా క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని కోరారు.

# ఫోటోగ్రాఫర్ కరుణాకర్ కుటుంబానికి అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మున్సిపాలిటీలోని అమీనాపురం ఎస్సీ కాలనీకి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ ఇనుముల కర్ణాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కొద్ది రోజుల క్రితం బ్రెయిన్‌లో నరాలు చిట్లి రక్తస్రావం కావడంతో ఆయనను చికిత్స నిమిత్తం నిమ్స్ హాస్పిటల్ కు తరలించగా,చికిత్స పొందుతూ మృతి చెందారు..ఆయనకు భార్య సుజాత, కుమారుడు షాన్, కుమార్తె రక్షిత ఉన్నారు.ఈ విషాద వార్త ను స్థానిక మిత్రులు వెంకట్ కన్నా, దండు శ్రీను ,కేసముద్రం ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ మిత్రులు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్యకు విషయం తెలియజేయగా వెంటనే స్పందించిన మృతుడి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్‌గా ఎన్నో సంవత్సరాలుగా ప్రజల జీవితాల్లోని మధుర జ్ఞాపకాలను తన కెమెరాలో బంధించిన కర్ణాకర్ మరణం ఎంతో బాధాకరమన్నారు. సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటుందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మృతుడి కుటుంబానికి ధైర్యం చెబుతూ ఫౌండేషన్ తరపున తక్షణ సహాయం కింద ఒక క్వింటాల్ బియ్యాన్ని కుటుంబానికి అందించారు.భవిష్యత్ లో కరుణాకర్ పిల్లల చదువుల కోసం అండగా ఉంటానని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో దండు శ్రీను, కళ్లెం శ్రీను, జన్ను కట్టయ్య, చంటి, శరత్, భాస్కర్, కరుణాకర్, శ్యామ్, అనిల్, కృష్ణ, రాజేందర్ కుమార్, అభిలాష్, సుశీల, యాకమ్మ, స్వర్ణలత, రమ, సరిత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి

* **ఎంపి ఈటల రాజేందర్ ను కలిసిన జెకె శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ లో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ను కలిసి సమస్య ను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగద్గిరినగర్ లో,బీరప్ప నగర్ లో, షిర్డీ హిల్స్ పోచమ్మ గుడి వద్ద బోర్ బావులు వేయించాలని కోరారు. ఎంపి సానుకూలంగా స్పందించి త్వరలో వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు జగన్ ముదిరాజ్, వరలక్ష్మి, శంకరయ్య, అభిషేక్ రెడ్డి, లింగమ్మ, విజయ రెడ్డి, మమత, ముత్యాలు, రమేష్, మమత, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ తోటలను పరిశీలించిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి కె.సహజ శుక్రవారం మండలంలోని పొనకల్ గ్రామంలో మిక్కిలినేని రాజశేఖర్‌కు చెందిన పామాయిల్ తోటను, దేవునిగూడ గ్రామంలోని పామాయిల్ తోటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రైతుల ఆదాయం పెంపొందించేందుకు ప్రభుత్వం సబ్సిడీతో ఆయిల్ ఫామ్ మొక్కలను సరఫరా చేస్తోందన్నారు. పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మొక్కల పెంపకం, యాజమాన్య పద్ధతులు, రువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం అందజేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అనారోగ్యాలకు గురై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలు దోనూరి శ్రీలక్ష్మికి రూ.7వేలు, సోమేశ్వర్ రెడ్డి రూ.36వేలు, పిన్నింటి పద్మ రూ.23వేలు, డాకోజి వెంకటేష్ రూ.32వేల చొప్పున మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, నాయకులు పన్నాల రాజిరెడ్డి, ఊదరి రమేష్, రాసాల జంగయ్య, దాచేపల్లి మనోహర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట.. సీఎం సహాయనిధి వరం

* **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సీఎం సహాయనిధి.. నిరుపేదల పాలిట వరంలాంటిదని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంజూరైన చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండలలోని వివిధ గ్రామాలకు 109మంది లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ అనారోగ్య పాలైన నిరుపేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేసుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పొనకల్‌లో ప్రభుత్వ భూమిలో షెడ్ల నిర్మాణానికి వినతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ శివారు సర్వే నెం. 374, విస్తీర్ణం 5 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిలో రోజువారీ సంత ఏర్పాటు కోసం షెడ్లు నిర్మించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. జన్నారంపొనకల్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, చికెన్, మటన్ విక్రయాలు జరుగుతున్నాయని,కుళ్లిపోయిన కూరగాయలు, వ్యర్థ పదార్థాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అందుకే ప్రభుత్వ స్థలంలో షెడ్లు నిర్మించి రోజువారీ సంత నిర్వహించాలని, "స్వయంభూ శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ" నిర్మాణం కోసం 6 గుంటల స్థలం కేటాయించాలని,"ఆదర్శ కళా సమితి భవనం" నిర్మాణానికి 6 గుంటల స్థలం కేటాయించాలని, తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని,అలాగే జన్నారం బస్టాండ్ నుండి ఎస్బిఐ బ్యాంక్ వరకు టాయిలెట్ రూం ఏర్పాటు చేయాలని కోరారు. జన్నారం, చుట్టుపక్కల మండలాల ప్రజలు వ్యాపార నిమిత్తం ప్రతిరోజు వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారని, వారికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ఎస్.ఆర్ బోస్, డిసిసి అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, ఆర్ పి ఐ పార్టీ అధ్యక్షులు మోతే పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొండకూరి ప్రభుదాస్, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు మరసకోల శ్రావణి, ఆదర్శ కళా సమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు తదితరులు ఉన్నారు.

## వడ్ల కొనుగోలను త్వరితగతిన పూర్తి చేయాలి

* **హుస్నాబాద్ బిజెపి మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద పడి కాపులకు వస్తున్నారని ఎండకు ఇబ్బందులకు గురవుతున్నారని,వడ్ల కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ హుస్నాబాద్ బిజెపి మండల అధ్యక్షులు ముఖ్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో తహసిల్దార్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సంపత్ నాయక మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు హుస్నాబాద్ లో స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తరుగు తేమ లేకుండా కొనుగోలు చేయాలని రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగిన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంట మల్లయ్య బైరి అరుణ్ నెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల రక్షణకై
## పోరాటమే పర్సాకు ఇచ్చే ఘననివాళి

– **సిపిఎం సీనియర్ నాయకులు పి రాజారావు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:కార్మిక హక్కుల రక్షణకై పోరాటాలు ఉధృతం చేయడమే పర్సా సత్యనారాయణకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు పి.రాజారావు అన్నారు. కార్మిక ఉద్యమ నేత, వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే పర్స సత్యనారాయణ 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక సెవెన్ హిల్స్ దగ్గర నిర్మించిన పర్స స్థూపాన్ని రాజారావు ఆవిష్కరించారు. ముందుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ జెండా ఆవిష్కరణ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారామ్, పర్సా సత్యనారాయణ కుమార్తె లీల, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, నర్సారెడ్డి, బ్రహ్మ చారి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధర్మ, నబి, వీర్ల రమేష్, భూక్య రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, కోబల్, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, సున్నం గంగ, మర్మం చంద్రయ్య, యాస నరేష్, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

* **అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాలేశ్వరంలోని మెగా విశ్రాంతి భవనంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి తక్షణ చెల్లింపులు జరిగేలా ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కాటారం ఆర్డీవో రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణితో నెరవేరిన కండక్టర్ సొంతింటి కల



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని వికాస్ నగర్ కు చెందిన ఆర్టీసీ కండక్టర్ సతీష్‌నాలు గేళ్లుగా ఎదురుచూస్తున్న తన ఇంటి సమస్యలకు ప్రజావాణి ద్వారా పరిష్కారం లభించింది. ఇంటి నిర్మాణం పూర్తికాక విద్యుత్, వీధి దీపాలు, కందకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఆయన పలుమార్లు వినతులు ఇచ్చినా పరిష్కారం కాలేదు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించిన ప్రజా వాణిలో సమస్య వివరించగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి కందకాలు పూడ్చి వేసి వీధి దీపాలు ఏర్పాటు చేయగా, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ రెడ్డి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఇంటికి కనెక్షన్ అందించారు. సమస్యలు పరిష్కా రం కావడంతో సతీష్ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తూ కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వడదెబ్బతో ఉపాధి హామీ కూలి మృతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ఒక వ్యక్తి వడదెబ్బతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ శుక్రవారం రోజున తెలిపిన వివరాల ప్రకారం మరణించిన వ్యక్తి ఉట్నూర్ మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన కోవా కిరణ్ కుమార్ (27) ఉపాధి హామీ కూలి, అని తెలిపారు. అతను గురువారం రోజున ఉపాధి హామీ పనులకు పొద్దున 8 గంటలకు వెళ్లి 10 గంటలకు వచ్చి, తన సెల్ ఫోన్ పనిచేయడం లేదని తను జన్నారానికి వెళ్లి సెల్ ఫోన్ బాగు చేసుకుని వస్తానని తనకు చెప్పినట్లుగా తన సోదరుడు కోవా సుంగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే జిల్లా అభివృద్ధి

**: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా అభివృద్ధి అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషి తోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక "కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇంది రమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి,మహిళాశక్తి వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చే కూరుతోందన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసు కొని పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ డ్రగ్స్,సైబర్ నేరాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఈ నెల 26న మెదక్ జిల్లా స్థాయి ఎంపికలు

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆదేశానుసారం మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ అథ్లెటిక్స్ స్టేడియం మెదక్ లో మంగళవారం ఉదయం 9.00 గంటలకు మెదక్ జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయి. రన్స్, త్రోస్, జంప్స్ మూడు విభాగాలుగా ఎంపికలు జరుగుతాయనీ అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలో పాల్గొంటారు.ఇందులో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రము లేదా ఎస్ ఎస్ సి మెమో తమ వెంట తీసుకుని రావాలని మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణర్తి వెంకటరమణ, మధుసూదన్ లు తెలిపారు.మరిన్ని వివరాలకై 9963005540 నెంబర్ ను సంప్రదించగలరు.

# అగ్నికి ఆహుతైన పంటలు..

* రైతులకు అండగా ఎమ్మెల్యే జీఎస్ఆర్



జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదాల్లో అరటి, పామాయిల్, మిరప పంటలు దగ్ధమవడంతో బాధిత రైతులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ఈ ఘటనలపై అధికారులు వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని ఆదేశించారు.చిట్యాల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సిరిపురం కుమారస్వామి అరటి తోట అగ్నికి ఆహుతైంది. ఇదే మండలంలోని చల్లగరిగ గ్రామంలో చాడ సమ్మిరెడ్డి పామాయిల్ తోట, చిట్యాల గ్రామంలో బాలవేణి వేణు మిరప పంట దగ్ధమయ్యాయి. టేకుమట్ల మండలం అంకుషాపురం గ్రామంలో చిత్తిరెడ్డి రమణారెడ్డి పామాయిల్ తోట కూడా అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయింది. ఈ ఘటనల అనంతరం ఎమ్మెల్యే జీఎస్ఆర్ బాధిత రైతుల పొలాలను స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పంటలు దగ్ధమైన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నష్టం అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ప్రభుత్వం తరపున కూడా తక్షణ సహాయం అందించాలని కోరిన ఎమ్మెల్యే, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పంట పొలాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి వర్మ జీవితం స్ఫూర్తిదాయకం

* అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: సామాజిక సంస్కర్త, అసమానతలపై పోరాడిన స్ఫూర్తియుత భాగ్యరెడ్డి వర్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యువరాజ్ మర్మాట్ అన్నారు శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, జిల్లా రెవెన్యూ అధికారి డేవిడ్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ సామాజిక సంస్కర్త, ఆది హిందూ స్థాపన స్థాపించి ఎన్నో సామాజిక మార్పులు తెచ్చారన్నారు. వారి జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొల్లపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేసిన మెదక్ జిల్లా ఎస్పీ. శ్రీనివాస రావు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: పశువుల అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ ఉండదని కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది ట్రాఫిక్ బ్యాటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మత్తు పదార్థాలు, బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలి

* జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రం పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశం ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.హాజరయ్యారు,ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ... ఆలపించి, ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.సభా ప్రాంగణం లో రెండు పడకల గదుల నిర్మాణం, ఆయిల్ పామ్, వ్యవసాయ, పరిశ్రమలు వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ రెడ్ క్రాస్, చేనేత వస్త్రాల, తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ను ఏర్పాటు చేశారు,రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు జిల్లాలో అమలు, జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం పై చర్చ ప్రస్తుతం అలాగే నూతన పథకాలు 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్న విధానంపై సమావేశం కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించడానికి క్షేత్ర స్థాయిలో జవాబుదారితనం పారదర్శకత తో కూడిన మెరుగైన పాలనను ప్రజా అభిప్రాయానికి ప్రత్యేకించి నిరుపేద అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సామాజిక న్యాయ ఆర్థిక సాధికారిక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సేవలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఐదవ స్థానంలో జిల్లా ఉందని, ఇంటర్మీడియట్ , వృత్తివిద్య కోర్సులపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతామని అన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్లో వేగంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పంట మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కల్పించాలని, ఇతర వాణిజ్య పంటలు పామ్ ఆయిల్, పప్పు దినుసులు, సేంద్రీయ వ్యవసాయం, ఎరువులు, సెరికల్చర్, హార్టికల్చర్, పంటలపై రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా రైతులు ముందుకు సాగాలన్నారు. పదవ తరగతి పూర్తి అయిన వెంటనే వృత్తి విద్యా శిక్షణ తరగతులలో చేరి ఉపాధి పొందాలని తెలిపారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, (ఇన్చార్జి) అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పిడి హౌసింగ్ జెడ్పి సీఈవో పురుషోత్తం,మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఎస్పీ తిరుపతిరావు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ మున్సిపల్ చైర్పర్సన్లు, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, స్వయం సహాయక బృందాలు, జిల్లాలోని అందరూ ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# బి ఎస్ పి కి వచ్చే ఎన్నికల్లో యువత అండ

* బిఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలం గడుపుతున్న ప్రభుత్వాలకు యువత తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగులు, ఆర్టీఐ కార్యకర్తలు, జర్నలిస్టులు, లాయర్లపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన అభిజిత్ దుల్కే "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో సోషల్ మీడియాలో అకౌంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. తక్కువ సమయంలోనే ఆ పార్టీకి కోట్ల సంఖ్యలో యువత మద్దతు తెలపడం దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలు, వైద్య సేవల సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, పరీక్షల లీకేజీలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వంటి పలు అంశాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే యువత కొత్త ఆలోచనల వైపు మొగ్గుచూపుతోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత మద్దతుతో బీఎస్పీ పార్టీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ సుధాకర్ శరత్ పాల్గొన్నారు.

# బండగుట్ట ఆలయంలో విషాదం..



* కోనేరులో పడి అర్చక తండ్రీ కొడుకుల మృతి

లింగాల ఘణపురం / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని లింగాలగణపురం మండలం బండ్ల గూడెం గ్రామ శివారు లో ఉన్న బండగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు వరయోరు లక్ష్మీనరసింహా చార్యులు, ఆయన కుమారుడు పవన్ కుమార్ ఆచార్యులు ఆలయ కోనేరులో మృత దేహాలుగా కనిపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బుధవారం సాయంత్రం నుంచి తండ్రీకొడుకు లు కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్న రైతులకు ఆలయ గుండంలో వారి మృత దేహాలు తేలుతూ కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కోనేరులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, లక్ష్మీనరసింహా చార్యుల భార్య శ్రీదేవి గత నెల 19న అనారోగ్యం తో మృతి చెందినట్లు తెలిసింది. అప్పటి నుంచి తండ్రీకొడుకులు తీవ్ర మనస్తాపంలో ఉన్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. ఈ క్రమంలోనే వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో బండగుట్ట ఆలయ పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది.

# గిరిజనుల మహా ధర్నాను విజయవంతం చేయండి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 26వ తేదీన లంబాడ హక్కుల పోరాట సమితి సేవాలాల్ సేన అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమం ను విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి కేంద్ర కమిటీ సభ్యులు బానోతు వెంకటరామ్ నాయక్ అన్నారు ఈరోజు గరిడేపల్లి మండల కేంద్రంలో గిరిజన నాయకులు కలిసి కరపత్రాలు ఆవిష్కరణ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న కూడా గిరిజనులకు ఏ ఒక్కటి హామీలు అమలు పరచలేదని గిరిజనులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని అదే విధంగా శాసనసభలో గిరిజనులకు కూడా మంత్రి పదవి ఇవ్వాలని వారు అన్నారు చేవెళ్ల డిక్లరేషన్ అకారం లంబాడీలకి ఇచ్చిన 12 హామీలను అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విన్నవించారు లంబాడీలను ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నారని ఏ ఒక్కటి కూడా హామీలు అమలు చేయలేదని వారు కోరారు ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గుగులోతు హేమ్లా నాయక్ మండల అధ్యక్షులు సందీప్ నాయక్ గిరిజన నాయకులు బాలు నాయక్ రవీందర్ నాయక్ పులియా నాయక్ వెంకట్రాం పుల్ సింగ్ నాయక్ శ్రీనివాస్ కోటయ్య పాల రవీందర్ ఎస్ ఆర్ ఛానల్ రాంబాబు నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డులో సీఎం సభ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా యంత్రాంగం



ప్రజా స్ఫూర్తి, కోమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను పురస్కరించుకుని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా ఎస్పీ నితికా పంత్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, విఐపిలతో పాటు ప్రజల వాహనాల పార్కింగ్ స్థలాలను వారు నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత విజయవంతం అయ్యేలా, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్, ఎం. డేవిడ్, అసిస్టెంట్ కలెక్టర్లతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# వాహనదారులు వన్ వే లో ప్రయాణించాలి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలో ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు,రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శభరిష్. పి. ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ తిరుపతి రావు సూచనల ప్రకారం పట్టణంలోని అండర్ బ్రిడ్జి నుండి శ్రీనివాస సెంటర్ వైపు వెళ్లే రూట్ లో వన్‌వే విధానం అమలు చేస్తున్నట్లు టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు.వాహనదారులందరు వన్‌వే నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

# ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరము

* రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బైపాస్ వద్ద ఉన్న ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామని, జూన్ 2 నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలనిఅధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఇంకా పలు కార్యక్రమాలు. చేయాల్సి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా అనేక కార్యక్రమాలను ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళినట్టు చెప్పారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ , జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. హోటళ్లు, లాడ్జిలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.రాత్రి పూట పటిష్టమైన నైట్ పట్రోలింగ్ నిర్వహించాలని, ప్రతి పట్రోలింగ్ అధికారి తప్పనిసరిగా పాయింట్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్రోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. పెండింగ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించాలని తెలిపారు.

# జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన, సంక్షేమ, అభివృద్ధి స్టాల్స్‌ను పరిశీలించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు విస్తృత స్థాయిలో చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా పని చేస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే గొప్ప కార్యక్రమం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అన్నారు. ఏ ప్రభుత్వం అయినా తమ విధానాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య , కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక శోభ సంతరించుకునే విధంగా మెదక్ జిల్లా అభివృద్ధి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం మెదక్ దాయార పురాతన కట్టడాలైన బావి, దేవాలయాలు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా దాయారంలోని స్వామి బావిని పరిశీలించడం జరిగిందని పురాతన స్వామి బావి ఈ ప్రాంతంలో ఉన్న పురాతన దేవాలయాలను సందర్శించామని స్వామి బావిని ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి తుది మెరుగులతో భావిని పునరుద్ధరించి భావితరాలకు ఈ భావియొక్క గొప్పతనాన్ని తెలిపే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. మెదక్ జిల్లాలోని పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుది రూపు తీసుకువచ్చే విధంగా పర్యాటక పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో మౌలిక వసతులు కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్. ఆర్డీవో రమాదేవి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం

*** మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. జిల్లా కేంద్రంలో జే ఫంక్షన్ హాల్లో మాదిగల ఓట్లు మాదిగలకే అనే నినాదంతో మాదిగ మహాశక్తి నాయకులు సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కానీ మాదిగల బతుకులు మారడం లేదని రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు ఉంటే అగ్రకులాలైన రెడ్లు, కమ్మలు వెలమలు, అధికారాన్ని చలాయిస్తూ మాదిగలను, బహుజన కులాలను పావులుగా, ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల ఓట్లు మాదిగలకే వేసుకుంటే మన సత్తా ఏందో తెలుస్తదని ఓటుకి ఎంత బలం ఉందో అగ్రకులాల కు వణుకు పుడుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో 50 వేలకు మంది పైగా మాదిగలు ఉన్నారని మన ఓట్లు మనమే వేసుకుంటే బీసీల సహకారంతో మాదిగలు రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేయవచ్చని అన్నారు. మాదిగల మహాశక్తి జండా ఎగరాలని రిజర్వేషన్లు ఉన్న ఫలాలు అందటంలో పాలకులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మాల కుటుంబాలకే, సీట్లు మంత్రి పదవులు దక్కాయని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, ప్రొఫెసర్ కనకయ్య, దుర్గయ్య గౌడ్, బండారు సుధాకర్, కేవీ, మాచర్ల సైదులు, డేవిడ్, మస్తాన్, దయానందం, జయశంకర్, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించా రు. శుక్రవారం జనగామ మండలం శామీర్‌పేట్ లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు, లోడింగ్ పరిస్థితుల పై కేంద్ర నిర్వాహకు లను అడిగి తెలుసుకు న్నారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, సీరియల్ ప్రకారం ధాన్యం తరలింపు జరుగుతోందో లేదో, ఎన్ని లారీలు మిల్లులకు పంపించారో వివరాలు సేకరించారు. అనంతరం కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు చేసిన కలెక్టర్, ధాన్యం సీరియల్ ప్రకారమే మిల్లులకు తరలించాలని, సరిపడా కార్మికులను ఏర్పాటు చేసి లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగ వంతం చేయాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు, ఓపీఎంఎస్ నమోదు ల్లో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**– జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి . ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ శాఖలు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అనాధ మహిళా మృతదేహాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శుక్రవారం అప్పగించారు. సుజాత (70) హైదరాబాద్ పాతబస్తీకి చెందిన వృద్ధురాలిని గుర్తించిన మానుకోట పోలీసులు రెడ్యాల గ్రామంలోని అనాథ వృద్ధ ఆశ్రమంలో చేర్పించారు. గత ఆరేళ్లుగా ఆమె బాగోగులు ఆశ్రమంలో నిర్వాహకులు లోకేష్ చూసుకుంటున్నారు. సుజాత గురువారం రాత్రి కన్నుమూశారు. విషయం లయన్స్ క్లబ్ బాధ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బి. వీరన్న, కార్యదర్శి పరకాల రవీందర్ రెడ్డిల చొరవతో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, అటానమి ఇన్చార్జి డాక్టర్ భరత్ కుమార్ లతో సమన్వయం చేసి సుజాత మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి తరలించారు. ఈ సందర్భంగా క్లబ్ జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్ రెడ్డి, క్లబ్ సీనియర్ సభ్యులు పమ్మి సనాతన చారి, మాలె కాళీనాథ్, ఆశ్రమ నిర్వాహకులు లోకేష్ కుమార్ తదితరుల సమక్షంలో మెడికల్ కళాశాలకు అప్పగించారు. డాక్టర్ వీరన్న మాట్లాడుతూ కన్న పిల్లలున్నా తల్లిదండ్రుల పోషణ భారం అవుతుందని భావించిన కొందరు తల్లిదండ్రులను రోడ్డున పడేసిపోవడం దారుణమన్నారు. ఈ దయనీయ స్థితిలో తల్లిదండ్రులు అనాథలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి వృద్ధాశ్రమాలు అక్కున చేర్చుకుని అండగా నిలువడం అభినందనీయమన్నారు. సుజాత ఆలనా పాలనా చూసేందుకు ముందుకు వచ్చిన ఆశ్రమం నిర్వాహకులు లోకేష్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అనాటమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల కోసమే ఉద్భవించిన పార్టీ టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన)

*** నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ**

ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ :తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, ప్రజల కోసమే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఉద్భవించిందని ఆ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ అన్నారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు. మే 20 నుండి జూన్ 20 వరకు నెల రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్న జెండా పండుగ కార్యక్రమాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన టీఆర్ఎస్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాసరావు, రాజేంద్రనగర్ ఇంచార్జ్ విష్ణుమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగన్న గౌడ్, జెపి శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, చటన్ పల్లి ఆంజనేయులు, వెంకటయ్య, రాజు నాయక్, మాజీ సర్పంచ్ దుర్గమ్మ, మహిళా నాయకురాళ్లు ఎన్. ప్రవీణ, ఇంద్రజ, సుమ సునీత, అర్చన, ప్రమీల తదితర పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళా వైభవానికి కాళేశ్వరం వేదిక

*** పరం పర నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకుల ప్రశంసలు**



జయశంకర్ భూపాలపల్లి,కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : పరం పర ఆధ్వర్యంలో నిర్వహించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా కళాకారులు అందించిన ప్రదర్శనలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించి కళాకారులను అభినందించారు. కళాకారుల భావ వ్యక్తీకరణ, నైపుణ్యం, సమన్వయం ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు అందుకుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ కళల పరిరక్షణ, అభివృద్ధికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పరం పర సంస్థ చేపట్టిన కార్యక్రమాలు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు వీక్షించారు.

## ఎస్సై బి శ్రీకాంత్ గౌడ్ ని సన్మానించిన గిరిజన నాయకులు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ని గిరిజన నాయకుడు మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ గిరిజన తలపాక మరియు శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నీలా హేమ్లా నాయక్ మాట్లాడుతూ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ గరిడేపల్లి మండల ప్రజలకు మంచి సేవ చేయాలని అతను కోరినారు. ఇట్టి సమావేశానికి ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి బానోతు వెంకట్రాం నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు గూగుల్ సందీప్ నాయక్. రాంబాబు నాయక్ నాగు నాయక్ బాలు నాయక్ ఫుల్యా నాయక్ రవీందర్ విద్యా కమిటీ చైర్మన్ కోటయ్య మాజీ నీటి సంఘం డైరెక్టర్ వెంకట్రావు నాయక్ మాజీ వార్డ్ నెంబర్ శీను నాయక్ పాల డైరీ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్ పరిధిలోని ఫాస్ట్ ఫుడ్ నేపాల్ కార్మికుల వివరాల నమోదు



నేరేడ్‌మెట్, ప్రజాస్ఫూర్తి : స్థానిక పాత పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం నేరేడ్‌మెట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక గుర్తింపు , భద్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరేడ్‌మెట్ పరిధిలోని వివిధ ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలలో వంట మాస్టర్లుగా, కార్మికులుగా పనిచేస్తున్న నేపాల్ దేశస్థుల వివరాలను ఈ సందర్భంగా సేకరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, స్థానికంగా నివసిస్తున్న విదేశీ కార్మికుల భద్రతను పర్యవేక్షించడానికి తెలంగాణ పోలీస్ వారి అధికారిక 'మీ సురక్ష' యాప్‌లో వారి పూర్తి వివరాలను నమోదు చేయించి, దరఖాస్తులు స్వీకరించారు.

# మహిళ పై దాడి బంగారు ఆభరణాల అపహరణ

* **చికిత్స పొందుతూ మహిళ మృతి.**

అక్కన్నపేట ,ప్ర జాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట మండలం మంచినీళ్ల బండ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు.నిద్రిస్తున్న మహిళలపై అరాచకంగా దాడి చేసి బంగారు ఆభరణాలను అపహరించుకొని వెళ్ళిపోయారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపుతుంది. మంచినీళ్ల బండ గ్రామానికి చెందిన బోయిని కనకయ్యకు ఇద్దరు భార్యలు కనకయ్య హమాలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇద్దరు భార్యలలో ఒకరు ఇంట్లో ఉంది ఇంకో భార్య బయటకి వెళ్ళింది ఇదే అదునుగా చూసుకొని దొంగలు ఇంట్లో చోరపడ్డారు ఇంట్లో నిద్రిస్తున్న రాజవ్వ పై విచక్షణ రహితంగా దాడి చేసి ఆమె మెడ నుంచి బంగారు గొలుసు కమ్మలను అపహరించుకొని తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అక్కడ నుండి దొంగలు వెళ్లిపోవడంతో కొద్దిసేపటికే రెండో భార్య ఇంటికి వచ్చేసరికి రక్తపు మడుగులో పడి ఉన్న రాజవ్వను చూసి ఆశ్చర్యానికి గురై చుట్టుపక్కల వాళ్ళకి సమాచారం అందించింది. అప్పటివరకు హమాలి పనికి వెళ్లిన అతని భర్త ఇంటికి ఇంకా రాలేదు చికిత్స కోసం బాధితురాలిని 108 అంబులెన్స్ లో హుస్నాబాద్ ప్రభుత్వ



ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించడంతో అక్కడే చికిత్స పొందుతూ రాజవ్వ మృతి చెందిందని బంధువులు తెలిపారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం లతో పరిసర ప్రాంతాలను పరిశీలించారు అనంతరం సిద్దిపేట సిపి రశ్మి పెరుమాళ్ ఏసిపి సదానందంతోకలిసి మంచినీళ్ల బండ గ్రామాన్నిసందర్శించి ఈ హత్య ఉదంతంపై ఆరా తీశారు. ఇది దొంగల పనేనా..? లేక వేరే ఎవరైనా కావాలనే చేశారా..? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం .అయితే ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హుస్నాబాద్ సిఐ కే శ్రీనివాస్ అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం కీతవారిగూడెం లో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్తినేని శ్రీనివాస్ కుటుంబాన్ని రాష్ట్ర తొలి కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షుడు బంధు శ్రీధర్ బాబుతో కలిసి శుక్రవారం పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలోనే తిరిగి కుటుంబ సభ్యులను ఆదుకోవడంలో కుల సంఘం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించడంతో పాటు బాధిత కుటుంబానికి భవిష్యత్తులో ఆదుకుంటామని అయన తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.75 వేల రూపాయల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాయిలి వెంకటనారాయణ,రామినేని సత్యనారాయణ,యర్రంశెట్టి సైదయ్య,హాసనభాధ రాజేష్, దొంగరి నాగేశ్వరావు, బోలిశెట్టి మధు, తీపిరిశెట్టి రాజు, దొంగరి శ్రీనివాసరావు, గుండు సైదయ్య, కీత రామనాథం, కీత అంజయ్య, ముత్తినేని సుబ్బయ్య, కిరణ్, సోమయ్య, రామకృష్ణ, సంజీవ్ బాబు, లక్ష్మీనారాయణ, అంజయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి నగర్ లో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి పాపిరెడ్డి నగర్ లోని రోడ్ నెంబర్ 20సి లో ఆధ్వానంగా మారిన రోడ్లను శుక్రవారం మరమ్మతు పనులను కాలనీ అధ్యక్షులు ఉట్ల చంద్రారెడ్డి చేయించారు. స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఆదేశాలతో జిహెచ్ఎంసి అధికారులు సహాకారం తో రోడ్ల మరమ్మతులు ముందుస్తుగా జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలమయంగా మారిన రోడ్లపై విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మరమ్మతు పనులు చేయించామన్నారు. త్వరలోనే స్కూల్స్ రి ఓపెన్ కావడం జరుగుతుందని, వర్షా కాలం వస్తున్నందున గుంతలల్లో నీరు నీలిచి దోమలు చేరడం వలన డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లోప్రధాన కార్యదర్శి ఆర్. భగవంతరెడ్డి. లక్ష్మణ్, అరుణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన్‌పల్లిలో హెల్త్ అవుట్‌రీచ్ క్యాంప్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జనజాతీయ గౌరవ్ ఉత్సవ్ , జన్ భాగీదారీ అభియాన్ 5వ రోజులో భాగంగా జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో సమగ్ర హెల్త్ అవుట్‌రీచ్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు.ఈ క్యాంప్‌లో రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి,చికిత్స అందించారు. ఏ ఎన్ సి చెకప్‌లు,ఎన్ సీ డి లు,సికిల్ సెల్ డిసీజ్ మరియు టీబీ స్క్రీనింగ్ నిర్వహించారు. వడగాల్పులు, వడదెబ్బ లక్షణాలు, చికిత్స మరియు నివారణ చర్యలపై ఆరోగ్య అవగాహన కల్పించారు.ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లు డా.జి. ఉమాశ్రీ, డా. పి. ఆదిత్య బాబు,పీఎం జన్ మాన్ సిబ్బంది, ఎమ్మెల్ హెచ్పి కె. పూజ,జి. లక్ష్మి,కె. వసంత, హెల్త్ అసిస్టెంట్ కే.పోచయ్య,ఆశా కార్యకర్తలు ఎం.సుమలత, ఆర్.ఉమ,కె. సునీత,పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దమ్ము.. ధైర్యం ఉంటే.. బహిరంగ చర్చకు సిద్ధంకండి

* **సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేయడం తగదు**
* **పబ్బు రాజు గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: దమ్ము.. ధైర్యం ఉంటే.. ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ సవాల్ విసిరారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్న తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. బీసీ వర్గానికి చెందిన తాను కొత్త కారు కొంటే ఓర్వలేక సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారానికి తెరలేపాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎంత నిజాయితీగా పని చేస్తాడో, తన అనుచరులు కూడా అంతే నిజాయితీగా పనిచేస్తారన్నారు. మెట్టు మెట్టు ఎక్కి ఈ స్థాయికి వచ్చామని గుర్తు చేశారు. నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలని ఘాటుగా స్పందించారు. మీ గురించి మేము సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కొందరి జీవితాలు కూలిపోతాయన్నారు. ఆ స్థాయికి మమ్మల్ని దిగజార్చవద్దన్నారు. మీ ప్రవర్తన మార్చుకోకపోతే భౌతిక దాడులకు వెనకాడమని హెచ్చరించారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ్మా గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నకూతుర్ని అమ్మకానికి పెట్టిన కసాయి తల్లిదండ్రులు అరెస్ట్

: **ఏసీపీ భీమ్ శర్మ**



జనగామ ,ప్రజాస్ఫూర్తి , : కన్నకూతురిని రూ.20 లక్షలకు అమ్ముకుని ఆమెకు ఇష్టం లేకుండా బలవంతంగా వివాహం జరిపించిన ఘటనలో తండ్రి, సవతి తల్లి, వివాహం చేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల లహరి (18) జనగామ లోని గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఆమె తండ్రి కక్కెర్ల రాకేష్ గౌడ్, సవతి తల్లి రేణుక కలిసి పెంబర్తి గ్రామానికి చెందిన ఆవుల ప్రశాంత్ రెడ్డికి రూ.20 లక్షలకు అమ్మి వివాహం జరిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెళ్లికి ఒప్పుకోకపోతే పురుగుల మందు తాగి చనిపోతామని బెదిరించడం తో, ఇష్టం లేకపోయినా లహరి 8వ తేదిన వివాహానికి అంగీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం ఈ నెల 21న ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కక్కెర్ల రాకేష్ గౌడ్, కక్కెర్ల రేణుక, ఆవుల ప్రశాంత్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణ రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది కర్ణాకర్, కృష్ణ, అనిల్ కుమార్, రమేష్, మధులను జనగామ ఇన్‌చార్జ్ ఏసీపీ భీమ్ శర్మ అభినందించారు.

## సామాజిక సమానత్వం కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయం

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ దళిత ఉద్యమ చరిత్ర లో చెరగని ముద్ర వేసిన మహనీయుడు, ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో దళిత ఉద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్, మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి తదితరులు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ తన జీవితాన్ని అణగారిన వర్గాల సామాజిక, విద్యా, ఆత్మగౌరవ ఉద్యమాలకు అంకితం చేశారని తెలిపారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత, అస్పృశ్యత నిర్మూలన కోసం ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థాన కాలంలోనే దళిత బాలికల విద్యాభివృద్ధికి పాఠశాలలను స్థాపించి విద్యా చైతన్యానికి బీజాలు వేశారని గుర్తుచేశారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది,పలు సంఘాల ప్రతినిధులు పాల్గొని మహనీయునికి నివాళులర్పించారు.




## జిల్లా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

* **కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్**

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం క్షేత్రస్థాయి అధికారులు సమష్టి ఆలోచనలతో, కలిసికట్టుగా పని చేస్తూ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి నివేదికపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం స్థానిక రవి మహల్ లో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి తోడుగా ఉంటారని భరోసా ఇచ్చారు.జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ కోరారు. అనంతరం ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ మారకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సమాజంలో యువతను, విద్యార్థులను పట్టిపీడిస్తున్న గంజాయి లాంటి మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించి వేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగాపనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నివారణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక ఆర్డర్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డి ఆర్ డి ఓ పి డి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డి ఎస్ సి డి ఓ దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు, సర్పంచులు, డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుంది

* **గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్మల్ చెరువు గ్రామంలో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## డా.ఎనగందుల వెంకటేష్ కు "బెస్ట్ కన్జర్వర్ అవార్డు"



ప్రజాస్ఫూర్తి , జన్నారం : అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బిర్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో, వన్యప్రాణి పరిశోధకుడు డా.ఎనగందుల వెంకటేష్ కు "బెస్ట్ కన్జర్వర్ అవార్డు" ప్రదానం చేశారు.హైదరాబాద్ టైగర్ కన్సర్వేషన్ సొసైటీ ఉత్తర తెలంగాణ సమన్వయకర్తగా పనిచేస్తున్న ఆయన, అరుదైన పక్షులు, మాక్రోఫంగై జాతుల డాక్యుమెంటేషన్, వలస పక్షుల మానిటరింగ్‌లో విశిష్ట సేవలందించారు.అటవీ శాఖ కార్యదర్శి నదీమ్ ఐఏఎస్,జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్,జీవ వైవిధ్య మండలి చైర్మన్ కట్రడే ఐఏఎస్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.ఈ సందర్భంగా సంరక్షణవేత్త ఇమ్రాన్ సిద్దిఖీ మాట్లాడుతూ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ విద్య రంగాల్లో డా.వెంకట్ అనేక సంవత్సరాలుగా చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపు అన్నారు.జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ సహా పలువురు అటవీ అధికారులు డా.వెంకట్‌ను అభినందించారు.

## యశోధలో అరుదైన గర్భాశయ చికిత్స విజయవంతం

* **ప్లాసెంటా పర్‌క్రెటాతో గర్భాశయం చీలిక చికిత్స విజయవంతం**
- **డా. ఎం.వి. జ్యోత్స్న**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మలక్ పేట యశోధ ఆసుపత్రిలో అరుదైన గర్భాశయ చికిత్స విజయవంతంగా నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెంలోని హైవే9లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం.వి. జ్యోత్స్న మాట్లాడుతూ అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన "ప్లాసెంటా పర్‌క్రెటా" కారణంగా గర్భాశయం చీలికకు గురైన 27ఏళ్ల గర్భిణికి మలక్‌పేట్‌లోని యశోధ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ వైద్య బృందం విజయవంతంగా చికిత్స అందించిందన్నారు. 28వారాల 6రోజుల గర్భిణి తీవ్ర కడుపు నొప్పి, రక్తస్రావం, శ్వాస సమస్యలు, హేమరేజిక్ షాక్‌తో ఆసుపత్రిలో చేరగా, సీటీ స్కాన్‌లో ప్లాసెంటా పర్‌క్రెటా కారణంగా గర్భాశయం చీలిపోవడం, భారీ అంతర్గత రక్తస్రావం ఉన్నట్లు గుర్తించామన్నారు. తన ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్, అనస్తీషియా, బ్లడ్ బ్యాంక్ నిపుణుల సమన్వయంతో అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి గర్భాశయ చీలికను విజయవంతంగా చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం స్థిరపడగా, విజయవంతంగా డిశ్చార్జ్ చేశారన్నారు. ప్లాసెంటా పర్‌క్రెటా వల్ల గర్భాశయం చీలిపోవడం అత్యంత ప్రమాదకర పరిస్థితి అని, సమయానికి నిర్ధారణ చేసి అత్యవసర శస్త్రచికిత్స, రక్త మార్పిడి, ఐసీయూ పర్యవేక్షణ అందించడం వల్లే రోగి ప్రాణాలు కాపాడగలిగామన్నారు.



# విద్యుత్‌ను పొదుపుగా వాడుకోండి: కేంద్ర విద్యుత్ శాఖ

ఎండలు మండిపోతుండడంతో పగలు ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. అనేక ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో దేశంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి పెరిగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ దేశ ప్రజలకు కీలక సూచనలు చేసింది. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ నియోగం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ముఖ్యంగా పగటిపూట విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుందని.. విద్యుత్‌ను జాగ్రత్తగా వాడుకోవాలని ప్రజలను కోరింది. మే 21న భారతదేశపు పగటిపూట గరిష్ట విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్ల (GW)తో గరిష్ట స్థాయికి చేరుకుందని విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తీవ్రమైన వేడి, ఉక్కపోత కారణంగా కరెంట్ వినియోగం వరుసగా నాలుగు రోజుల పాటు మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని పేర్కొంది. మే 18న పగటిపూట గరిష్ఠ డిమాండ్ 257.37 గిగావాట్లుగా ఉండగా.. మే 19న 260.45 గిగావాట్లకు చేరుకుందని తెలిపింది. మే 20న 265.44 గిగావాట్లు ఉండగా.. మే 21న 270.82 గిగావాట్లకు పెరుగుతూ అత్యధిక రికార్డులను నమోదు చేసినట్లు పేర్కొంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 24 గంటల మధ్య ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండటంతో ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని విద్యుత్ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల విద్యుత్ సరఫరా వ్యవస్థలు, గ్రిడ్ నిర్వహణపై ఒత్తిడి పెరిగి, విద్యుత్ డిమాండ్‌లో పెరుగుదల చోటు చేసుకుంటోందని పేర్కొంది. డిమాండ్‌లో ఈ భారీ పెరుగుదల ఉన్నప్పటికీ.. విద్యుత్ సరఫరా పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను తీర్చడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొంది.




## 24 రాజ్యసభ స్థానాలకు
# ఎన్నికల షెడ్యూల్ విడుదల

జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 20 కల్లా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**ఏపీలో నాలుగు స్థానాలకు..**

ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 26న ముగియనుంది. దీంతో ఏపీలోని నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

# నీట్ పేపర్ లీక్.. మరో కీలక నిందితురాలి అరెస్టు




నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు తాజాగా మరో నిందితురాలిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పుణెకు చెందిన బోటనీ లెక్చరర్ మనీషా మంధారేను అదుపులోకి తీసుకున్న సీబీఐ.. తాజాగా అదే ప్రాంతానికి చెందిన మనీషా సంజయ్ హవల్దార్ అనే మరో మహిళను అరెస్టు చేసింది. ఆమె పుణెలోని సేథ్ హీరాలాల్ సరాఫ్ కళాశాలలో పనిచేస్తున్నట్లుగా అధికారులు తెలిపారు. నీట్ పరీక్ష ప్రక్రియలో ఎక్స్‌పర్ట్‌గా ఉన్న మనీషాను ఫిజిక్స్ పేపర్‌ను లీక్ చేశారన్న అభియోగంపై అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్‌లో నీట్ యూజీ 2026 ఫిజిక్స్ ప్రశ్నలను సహ నిందితురాలైన మనీషా మంధారేతో ఈమె షేర్ చేసుకున్నట్లుగా సీబీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. మే 3న జరిగిన నీట్ పరీక్ష లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, లాతూర్, అహిల్యనగర్‌కు చెందిన మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# నటి ట్విష మృతి కేసులో కీలక పరిణామం



మాజీ మిస్ పుణె, నటి, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ మృతి కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసులో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండోసారి శవపరీక్షకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతించింది. తమ కుమార్తె మరణాన్ని ఒక ఆత్మహత్య కేసుగా చూడొద్దని, ఈ ఘటనలో సునిశితమైన ఫోరెన్సిక్ పరిశీలన అవసరమని ట్విష కుటుంబం కోరగా.. వారి అభ్యర్థనను కింది కోర్టు తిరస్కరించింది. తాజాగా హైకోర్టు నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఢిల్లీ ఎయిమ్స్ బృందం భోపాల్‌లో ఈ పరీక్షను నిర్వహించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. తొలిసారి జరిపిన శవపరీక్షలో లోపాలున్నాయని, ఆమె ఉరి వేసుకొని చనిపోవడానికి ఉపయోగించిన మెటీరియల్‌ను పోలీసులు శవపరీక్ష సమయంలో అప్పగించలేదని ట్విష కుటుంబం తమ పిటిషన్‌లో పేర్కొంది. ఆమె చనిపోయిన మూడు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయిందని తెలిపింది. పోస్టుమార్టంలో ప్రస్తావించిన మృతురాలి పొడవు పోలీసు రిపోర్టులో రాసిన పొడవులో తేడాలున్నాయని వెల్లడించింది. పది రోజుల క్రితం భోపాల్‌లో ట్విష చనిపోయింది. అప్పటికి ఆమెకు పెళ్లై ఐదు నెలలే. మృతి చెందడానికి ముందు తన తల్లి, స్నేహితురాలికి ఆమె పలు సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. తాను వేధింపులకు గురవుతున్నాననీ, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, తన జీవితం నరకంలా మారిందనీ, తాను ఈ వివాహ బంధంలో చిక్కుకుపోయానని వాటిల్లో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, ట్విష మృతి తర్వాత నుంచి ఆమె భర్త పరారీలో ఉన్నాడు. హైకోర్టులో వేసిన తన బెయిల్ పిటిషన్‌ను తాజాగా ఉపసంహరించుకున్నాడు. ట్రయల్ కోర్టు ముందు సరెండర్ అయ్యేందుకు ముందుకు వచ్చాడు. కాగా.. తెలుగులో 2021లో వచ్చిన 'ముగ్గురు మొనగాళ్లు' చిత్రంలో ట్విష ( నటించారు. పలు బ్రాండ్లకు ప్రచారకర్తగానూ వ్యవహరించారు.

# తల్లిదండ్రులిద్దరూ IASలైతే పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా?: సుప్రీంకోర్టు




రిజర్వేషన్ల అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులుగా ఉన్న పిల్లలకు వీటి అవసరమేంటని ప్రశ్నించింది. వెనకబడిన తరగతుల్లోని సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన వర్గాలకు (క్రీమీ లేయర్) రిజర్వేషన్ ప్రయోజనాలకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ జరిగింది. ''తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్‌లు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నారు. ఇలా ఒక స్థాయికి చేరుకున్న వ్యక్తుల్ని మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ, మీరు మాత్రం ఆ మినహాయింపుల్ని ప్రశ్నిస్తున్నారు. ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశం. విద్య, ఆర్థికంగా సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు మళ్లీ తమ పిల్లలకు రిజర్వేషన్లు కోరుతున్నారు. ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేము. తల్లిదండ్రులు ఉన్నత స్థాయికి చేరిన తర్వాత పిల్లల పరిస్థితి కూడా మారుతుంది. రిజర్వేషన్ల అమలులో సమతుల్యత అవసరం'' అని ఆ పిటిషన్ విచారణలో భాగంగా జస్టిస్ నాగరత్న అన్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొంది సామాజిక, ఆర్థిక సాధికారిత తర్వాత తమ కుటుంబంలోని తర్వాతి తరానికి అదే రిజర్వేషన్ పొందే విషయంలో ఎవరికి వారు పునః పరిశీలించుకోవాలని కోర్టు అభిప్రాయపడింది.



# ఉమర్ ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్

2020 నాటి ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయి జైలులో ఉన్న జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. ఖాలిద్ తల్లికి శస్త్రచికిత్స జరగనున్న నేపథ్యంలో ఆమెను కలిసేందుకుగాను అతడికి ఢిల్లీ హైకోర్టు అనుమతిచ్చింది. ఖాలిద్ గత ఆరేళ్లుగా జైలు జీవితం గడుపుతున్నాడు. తన మామగారి కర్మకాండలకు హాజరయ్యేందుకు, శస్త్రచికిత్స చేయించుకోనున్న తన తల్లిని కలిసేందుకు 15 రోజుల మధ్యంతర బెయిల్ కోరుతూ ఖాలిద్ తొలుత ట్రయల్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు అతడి అభ్యర్థనను తిరస్కరించడంతో.. హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, మధుజైన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఖాలిద్‌కు జూన్ 1 నుంచి మూడు రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు అనుమతించింది. ఆ సమయంలో అతడు తన ఇంటిలోనే ఉండాలని, ఆస్పత్రిలో ఉన్న తన తల్లిని మాత్రమే కలవాలి తప్ప.. మరే ఇతర ప్రదేశాలకు వెళ్లకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో రూ.లక్ష పూచీకత్తు కూడా చెల్లించాలని అతడికి తెలిపింది. అతని కదలికలపై కఠిన నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించింది.

# ఎవరెస్టుపై విషాదం.. ఇద్దరు భారతీయుల మృతి




ప్రఖ్యాత ఎవరెస్ట్ శిఖరంపై విషాదం చోటు చేసుకుంది. పర్వతారోహణ ముగించుకొని దిగువకు వస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. మృతులను అరుణ్ కుమార్ తివారీ, సందీప్ ఆరేగా గుర్తించారు. వారు కిందకు దిగుతున్న సమయంలో తీవ్రంగా అలసిపోయారని.. రక్షించేందుకు గైడ్స్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. బుధవారం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన 274 మంది పర్వతారోహకులలో సందీప్ ఆరే సహా తులసి రెడ్డి పాల్పునూరి, అజయ్ పాల్ సింగ్ అనే మరో ఇద్దరు భారతీయులు ఉన్నట్లు నేపాల్ ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్‌ను అధిరోహించిన బృందంగా వీరు ఒక కొత్త రికార్డు నెలకొల్పారు. అయితే పర్వతం దిగుతున్న సమయంలో సందీప్ ఆరే మృతి చెందారు. గురువారం సాయంత్రం మరో బృందం పర్వత శిఖరాన్ని చేరుకొని తిరిగి వస్తుండగా అరుణ్ కుమార్ తివారీ కూడా మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు.

## హైవేపై సీసీ కెమెరాలు అమర్చి..
# సైన్యం కదలికలపై పాక్‌కు ఉప్పందించి..!



పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత సైన్యానికి సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాక్‌కు చేరవేస్తున్న నెట్‌వర్క్‌ను పంజాబ్ పోలీసులు బట్టబయలు చేశారు. పఠాన్‌కోట్ జమ్మూ జాతీయ రహదారిపై నిఘా కెమెరాలు అమర్చి.. అక్కడి మిలిటరీ వాహనాల కదలికలను పాక్‌కు చేరవేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడిని పఠాన్‌కోట్‌కు చెందిన బల్జీత్ సింగ్‌గా గుర్తించారు. భారత సైన్యం, పారామిలిటరీ దళాలు తరచూ ఉపయోగించే పఠాన్‌కోట్ జమ్మూ కారిడార్ సమీపంలోని రహదారిపై నిందితుడు నిఘా పెట్టినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఇందుకోసం తక్కువ ఖర్చులో దొరికే ఇంటర్నెట్ ఆధారిత సీసీ కెమెరా వంటి పరికరాలను స్థానిక దుకాణంలో అమర్చినట్లు తెలిపారు. సైనికుల కదలికలను రహస్యంగా పర్యవేక్షించి.. ఆ రియల్ టైమ్ ఫుటేజీని పాక్ హ్యాండ్లర్‌లకు పంపుతున్నట్లు తెలిపారు. దుబాయ్ నుంచి అతడికి ఆదేశాలు, ఆర్థికసాయం అందుతున్నట్లు గుర్తించామన్నారు. పాక్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్లతో నిందితుడు సంప్రదింపులు జరుపుతున్నాడన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. పఠాన్‌కోట్ సైనిక స్థావరాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు.

# నా కుమారుడి పెళ్లికి హాజరైతే చంపేస్తారు: ట్రంప్



ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు.

## స్టెప్పులతో కిక్కెక్కించిన చరణ్, శృతి



**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. గ్రామీణ క్రీడా నేపథ్యంతో దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన చిత్రబృందం, తాజాగా అభిమానులకు ఓ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం 'హెల్లల్లల్లో'కు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ తమ డ్యాన్స్ స్టెప్పులతో అభిమానులకు మంచి కిక్ ఇచ్చారు.

భోపాల్ వేదికగా నేడు (మే 23- శనివారం) భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ప్రోమోను విడుదల చేయడం విశేషం. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్ స్వరాలు సమకూర్చారు. రెహమాన్ సంగీతం అనగానే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. దానికి తోడు ఇది స్పెషల్ సాంగ్ కావడంతో ఈ పాటపై ఆసక్తి రెట్టింపు అయింది. నేడు ఈ పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటపై మరో ఆసక్తికరమైన చర్చ కూడా సోషల్ మీడియాలో జరుగుతోంది. ఇందులో మరో కథానాయిక కూడా కనిపించనున్నారని, ఆమె ఎవరనే విషయాన్ని చిత్రబృందం రహస్యంగా ఉంచిందని ప్రచారం సాగుతోంది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. నేడు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు.

వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే భారీ హైప్ ఉన్న ఈ చిత్రానికి, ఈ స్పెషల్ సాంగ్ మరింత ఊపును తెచ్చింది.

## స్వీట్ లుక్‌లో హాట్ అట్రాక్షన్..!



- పంజాబీ డ్రెస్‌లో త్రిప్తి డిమ్రి అందాల సందడి
- 'స్పిరిట్'పై ఆశలు..
- సోషల్ మీడియాలో గ్లామర్ జోరు

**టాకీస్:** త్రిప్తి డిమ్రి పేరు వినగానే ప్రస్తుతం సినీ అభిమానులకు ముందుగా గుర్తుకు వచ్చేది యానిమల్ సినిమానే.. ఆ చిత్రంతో ఓవర్‌నైట్ స్టార్‌డమ్ సొంతం చేసుకున్న ఈ బాలీవుడ్ భామ, వరుస అవకాశాలతో కెరీర్‌ను పరుగులు పెట్టిస్తోంది.

'యానిమల్' తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆ సినిమా తెచ్చిపెట్టిన క్రేజ్‌ను మరే చిత్రం అందుకోలేకపోయింది. అయినా తనదైన శైలిలో ముందుకు సాగుతున్న త్రిప్తి, ఇప్పుడు 'స్పిరిట్' వంటి భారీ ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోవడంతో మరింత ఉత్సాహంగా ఉంది. ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇక సోషల్ మీడియాలో త్రిప్తి డిమ్రి హవా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'యానిమల్' తర్వాత ఆమె ఫాలోయింగ్ అమాంతం పెరిగిపోయింది. అభిమానుల అంచనాలకు తగ్గట్టుగానే ఎప్పటికప్పుడు కొత్త ఫొటోషూట్లతో అలరిస్తోంది.

తాజాగా పంజాబీ డ్రెస్ లో త్రిప్తి షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంప్రదాయ దుస్తుల్లోనూ తనదైన గ్లామర్‌తో ఆకట్టుకుంటూ, స్వీట్ లుక్‌తో పాటు స్టైలిష్ అటిట్యూడ్‌ను ప్రదర్శించింది. సహజమైన అందం, చిరునవ్వు, ఎలిగెంట్ లుక్ ఈ ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ తనదైన ముద్ర వేస్తున్న త్రిప్తి డిమ్రి, మరోసారి తన తాజా ఫొటోలతో అభిమానులను ఫిదా చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట ట్రెండింగ్‌లో కొనసాగుతున్నాయి.

## యూట్యూబ్ ఛానల్‌పై విష్ణుప్రియ ఫిర్యాదు..

**నోరు మూసుకుని కూర్చోలేనని వ్యాఖ్య**



- వ్యక్తిత్వ హననం చేస్తే ఊరుకోనన్న విష్ణుప్రియ
- యూట్యూబ్ ఛానల్ పై మియాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు
- కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళతామని హెచ్చరిక

**హైదరాబాద్:** సోషల్ మీడియాలో నటీనటుల వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ అసభ్యకరమైన కంటెంట్ పెట్టే వారిపై యాంకర్, నటి విష్ణుప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ 'ప్లే లైక్ ఇంకాగ్నిటో' అనే యూట్యూబ్ ఛానల్‌పై ఆమె హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ కంప్లైంట్‌తో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ... సదరు ఛానల్ నడిపే వ్యక్తి ఒక అమ్మాయి అయ్యుండి కూడా, సెలబ్రిటీ మహిళల క్యారెక్టర్‌ను కించపరుస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతోందని మండిపడ్డారు. తాము ఇండస్ట్రీకి వచ్చింది ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికని, నిజంగా తప్పు చేసినప్పుడు విమర్శిస్తే తలదించుకుని ఒప్పుకుంటామని అన్నారు. కానీ, డబ్బుల కోసం శరీరం అమ్ముకుంటుంది అంటూ అసత్య ఆరోపణలు చేస్తుంటే ఇంకా నోరు మూసుకుని కూర్చోలేనని, అందుకే తనతో పాటు ఇండస్ట్రీలోని ఆడపిల్లల కోసం ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు.

ప్రస్తుతానికి ఒక ఛానల్‌పై చర్యలు ప్రారంభించామని, ఇకపై ఎవరు ఇలాంటి రాంగ్ ఇన్ఫర్మేషన్‌ను ప్రాజెక్ట్ చేసినా వారి యూట్యూబ్ ఛానల్స్‌పై స్ట్రైక్స్ పడేలా, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళతామని విష్ణుప్రియ హెచ్చరించారు.



## పసిడికి బ్రేక్..

### పరుగులు పెడుతున్న వెండి

- వరుస పెరుగుదలకు బ్రేక్..
- స్వల్పంగా తగ్గిన బంగారం ధర
- మరోవైపు పరుగులు పెడుతూనే ఉన్న వెండి ధర
- హైదరాబాద్‌లో రూ.440 తగ్గిన 24 క్యారెట్ల పసిడి
- కిలో వెండిపై ఏకంగా రూ.5,000 పెరిగిన రేటు

**ముంబై:** గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు శుక్రవారం స్వల్పంగా బ్రేక్ పడింది. పసిడి ధర కాస్త తగ్గడంతో కొనుగోలుదారులకు కొద్దిగా ఊరట లభించింది. అయితే, వెండి ధర మాత్రం తన పరుగును కొనసాగిస్తూ మరోసారి భారీగా పెరిగింది.

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.1,59,490 వద్ద స్థిరపడింది. అలాగే, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.400 తగ్గి రూ.1,46,200కు చేరింది. మరోవైపు కిలో వెండి ధర గురువారంతో పోలిస్తే ఏకంగా రూ.5,000 పెరిగి రూ.2,95,000కు చేరుకుంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,61,240గా ఉండగా, ముంబైలో రూ.1,59,490గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,640 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశవ్యాప్తంగా వెండి ధరలు కిలోకు రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య పలుకుతున్నాయి.

## రైజర్స్ గెలిచినా..

- ఎలిమినేటర్ బరిలో హైదరాబాద్
- టాప్‌లోనే ఆర్‌సీబీ
- చెలరేగిన ఇషాన్, అభిషేక్, క్లాసెన్
- 55 రన్స్‌తో బెంగళూరు చిత్తు



**హైదరాబాద్:** టాప్-2లో చోటు దక్కించుకోవాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలు ఫలించలేదు. మరోవైపు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 55 పరుగులతో చిత్తుగా ఓడినప్పటికీ.. ఆ జట్టు టేబుల్ టాపర్‌గానే నిలిచింది. దీంతో ఈనెల 26న జరిగే క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ-గుజరాత్ పోటీ ఖాయమైంది. ఇక సన్‌రైజర్స్ కూడా 18 పాయింట్లతోనే ఉన్నా రన్‌రేట్ పరంగా మూడో స్థానంలో నిలిచింది. తద్వారా సన్‌రైజర్స్ ఈనెల 27న ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 79), అభిషేక్ శర్మ (22 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56), క్లాసెన్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), నితీశ్ (12 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 నాటౌట్) వేగంగా ఆడారు. రసిఖ్‌కు 2 వికెట్లు దక్కాయి. అయితే ఛేదనలో బెంగళూరు 166 పరుగులు చేస్తే తమ అగ్రస్థానానికి ఢోకా లేని పరిస్థితి ఉండగా.. ఆ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 200 పరుగులు చేసింది. దీంతో ఫలితం ఎలా ఉన్నా ఆర్‌సీబీ టాప్ స్థానానికి ముప్పు లేకుండాపోయింది. కెప్టెన్ రజత్ పటీదార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 56), వెంకటేశ్ అయ్యర్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), క్రునాల్ పాండ్యా (31 బంతుల్లో 5 ఫోర్లతో 41 నాటౌట్) రాణించారు. మలింగకు రెండు వికెట్లు లభించాయి. ఇషాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

**రజత్ అర్ధసెంచరీ:** భారీ ఛేదనలో ఆర్‌సీబీ తడబడింది. హిట్టింగ్ కోసం ఓపెనర్‌గా బరిలోకి దిగిన వెంకటేశ్ అయ్యర్‌తో పాటు మధ్య ఓవర్లలో రజత్ పటీదార్, క్రునాల్ పాండ్యా ఆకట్టుకున్నారు. కానీ రైజర్స్ బౌలర్లు ఆరంభం నుంచే మ్యాచ్‌ను అదుపులో ఉంచారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగడంతో బెంగళూరు చేసేదేమీ లేకపోయింది. తొలి ఓవర్‌లోనే అయ్యర్ 4,6 బాదగా.. నాలుగో ఓవర్‌లో 6,4,6,6తో 23 రన్స్ రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడిని పేసర్ మలింగ అవుట్ చేశాడు. అటు వచ్చీ రాగానే దేవ్‌దత్ పడిక్కల్ 4,6తో జోరు చూపాడు. ఇక ఆరో ఓవర్‌లో కోహ్లీ(15)ని పేసర్ సకీబ్ దెబ్బ తీయగా పవర్‌ప్లేలో ఆర్‌సీబీ 75/2తో నిలిచింది. అనంతరం పరుగులు నెమ్మదించగా.. దేవ్‌దత్ (21)ను మలింగ అవుట్ చేశాడు. ఈ దశలో రజత్-క్రునాల్ జోడీ రైజర్స్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంది. 6 బంతుల్లో 71 రన్స్ కావాల్సిన వేళ.. 15 రన్స్‌కే పరిమితమైన బెంగళూరు 200 స్కోరు చేసి ఓడింది.

**అదరగొట్టిన టాపార్డర్:** టాస్ గెలిచిన సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. వారి వ్యూహానికి తగ్గట్టుగానే టాపార్డర్ కదం తొక్కింది. ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్, క్లాసెన్ మెరుపు అర్ధసెంచరీలతో విరుచుకు పడడంతో రైజర్స్ రయ్‌మంటూ దూసుకెళ్లింది. కొత్త బంతితో పేసర్లు భువనేశ్వర్, హాజెల్‌వుడ్ వికెట్లు తీయలేకపోయారు. కానీ డెత్ ఓవర్లలో ఆర్‌సీబీ కాస్త పట్టు సాధించినా, అప్పటికే రైజర్స్ ఖాతాలో 250o పరుగుల భారీ స్కోరు చేరింది. నాలుగో ఓవర్‌లో 3 ఫోర్లు బాదిన ఓపెనర్ హెడ్ (26) అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో 63/1 పరుగులతో రైజర్స్ ఓ మాదిరిగానే కనిపించింది. కానీ ఆ తర్వాత అభిషేక్ జోరుకు స్కోరులో వేగం పెరిగింది. ఏడో ఓవర్‌లో 2 సిక్సర్లు, ఎనిమిదో ఓవర్‌లో 6,6,4తో 20 బంతుల్లోనే అభిషేక్ ఫిఫ్టీ పూర్తి చేశాడు. అప్పటికే రెండుసార్లు క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న అభిషేక్‌ను 9వ ఓవర్లో స్పిన్నర్ సుయాష్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు ఇషాన్‌తో కలిసి అందించిన 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ఇషాన్-క్లాసెన్ జోడీ బ్యాట్ ఝుళిపించింది. హాజెల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో క్లాసెన్ 6,6,4,6తో 27 రన్స్ రాబట్టాడు. అటు 31 బంతుల్లో ఆర్‌సీబీపై ఇషాన్ వరుసగా నాలుగో ఫిఫ్టీని పూర్తి చేశాడు. 16వ ఓవర్‌లో 6,4,4తో ఇషాన్ 20 రన్స్ అందించడంతో స్కోరు 200 దాటేసింది. తర్వాతి ఓవర్‌లోనే స్పిన్నర్ క్రునాల్ లోఆర్మ్ బంతికి క్లాసెన్ దొరికిపోయాడు. దీంతో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యానికి చెక్ పడింది. కానీ నితీశ్ అదే ఓవర్‌లో తానెదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. అయితే చివరి మూడు ఓవర్లలో 30 పరుగులే రావడంతో స్కోరు 260లోపే ముగిసింది.

## బీహార్‌కు ఐపీఎల్‌లో ఓ జట్టు ఉండాల్సిందే

### వేదాంతా గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్

ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు సంచలన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. పట్నాలో 1954లో ఆయన జన్మించారు. సోషల్ మిడియా వేదికగా ఓ పోస్టు వైరల్‌గా మారింది.



బిహార్ నుంచి అద్భుతమైన క్రికెటర్లు వస్తున్నారని అందులో పేర్కొన్నారు. 'ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మాదిరిగా బిహార్ కూడా అద్భుతమైన జట్టును కలిగి ఉండటానికి అర్హత ఉందని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సృష్టించాడు. సకిబ్ హుస్సేన్ (ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించడం. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది' అని అనిల్ అగర్వాల్ పోస్టు పెట్టారు. నాలుగేళ్ల కిందట రెండు ఫ్రాంచైజీలు అదనంగా వచ్చిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టాయి. ఇప్పటికే ఐపీఎల్ మార్కెట్ విలువ భారీగా ఉంది. దీంతో కొత్త ఫ్రాంచైజీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకటి, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి ఒక ఫ్రాంచైజీకి అనుమతి ఇవ్వాలని పలువురు కోరారు. ఇప్పుడు బిహార్‌కు చెందిన బిలియనీర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఐపీఎల్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.